క్లుప్తంగా

నేడు ప్రజాదీవెన

పెడన: పట్టణంలోని ఏడు, ఎనిమిది వార్డులలో వైఎస్సార్ సీపీ ప్రజాదీవెన కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పెడన పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఆ ప్రజాదీవెన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇంచార్జి, అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) పాల్గొని గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేస్తారని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాలలో 2024-పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీకే ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ శిక్షణ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94407 30562, 93903 53504, 82474 27885 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి పోతేపల్లి రైల్వే గేటు మూసివేత

కోనేరుసెంటర్: బందరు మండలం పోతేపల్లి మీదుగా పొట్లపాలెం వెళ్లే మార్గంలో రైల్వే గేటును మూడు రోజుల పాటు మూసి వేస్తున్నట్లు మచిలీపట్నం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఆర్.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఎల్‌సీ నంబర్ 37 (పోతేపల్లి గేటు) సమీపంలోని రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు గేటును మూసివేసి మరమ్మతులు నిర్వహిస్తారు. ఈ మార్గం నుంచి వెళ్లేవారు విషయాన్ని గ్రహించి రైల్వే అధికారులకు సహకరించాలని కోరారు.

పశుసంవర్ధకశాఖ ఏడీకి గాయాలు

పెడన: రోడ్డు ప్రమాదంలో పశుసంవర్ధక శాఖ పెడన ఏడీ(అసిస్టెంట్ డైరెక్టర్) కొనకళ్ల బాబూరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఆయన మచిలీపట్నం నుంచి పెడన పశుసంవర్ధక శాఖ ఆసుపత్రిలో విధులు నిర్వహించడానికి వస్తున్న సమయంలో పెడన మచిలీపట్నం బైపాస్‌రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద కళ్లు తిరిగి ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడ్డారు. స్థానికులు గమనించి ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మచిలీపట్నం ఆసుపత్రిలో చూపించగా కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. పక్కటెముకలు డ్యామేజ్ కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు బుధవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే హుండీ లెక్కింపులో ఆసక్తిగల భక్తులు డ్రెస్ కోడ్‌లో పాల్గొనాలని కోరారు.

ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను పట్టించుకోవద్దు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు
- సముద్ర తీర గ్రామం గుల్లలమోదలో ఆత్మీయ సమావేశం



ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే రమేష్‌బాబులను సాదరంగా ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

గుల్లలమోద(నాగాయలంక): రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు ఎంతగానో లబ్ధి చేకూరిందని, ప్రతిపక్షాలు చేసే తప్పుడు ఆరోపణలను ప్రజలు పట్టించుకోనవసరం లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నాగాయలంక మండలంలోని సముద్ర తీర గ్రామం గుల్లలమోదలో మంగళవారం ఇరువురు పర్యటించారు. ప్రజలు, పెద్దలతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు అధ్యక్షతన గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం జరిగింది. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవించాలనేదే జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని, ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలోనే రూ.1,858 కోట్ల మేరకు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని, ఆయనను ప్రజలు మర్చిపోయారంటే సంక్షేమానికే విఘాతమన్నారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక దివిసీమ తీర గ్రామాల ప్రజలకు కుల, మత వర్గ బేధాలు లేకుండా ఎంతో అభివృద్ధి చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్న గెలుపే పేదవర్గాలకు బలమని, కొనసాగుతున్న సంక్షేమానికి ప్రజలంతా ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్ ను గ్రామస్తులకు పరిచయం చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఇరువురుకి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ యువ నేతలు సింహాద్రి వికాస్, సింహాద్రి రామచరణ్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, గుల్లలమోద ప్రముఖులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీలో చేరారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాము



కోకనారాయణపాలెంలో ప్రజాదీవెన యాత్రలో ఓటు అభ్యర్థిస్తున్న ఉప్పాల రమేష్, హారిక

గూడూరు: గ్రామీణ ప్రాంత ప్రజల సంక్షేమం, అభివృద్ధి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా గూడూరు మండలం కోకనారాయణపాలెంలో జెడ్పీ ఛైర్ పర్సన్ ఉప్పాల హారికతో కలిసి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అర్హులైన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. అవినీతి రహితంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతాయన్నారు. గతంలో ఏదైనా పథకం ద్వారా లబ్ధి పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయాల వ్యవస్థ ద్వారా పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుడికే అందాయన్నారు. సంక్షేమంతో పాటు ఇటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. గ్రామంలో సచివాలయ నిర్మాణం, రైతు భరోసా కేంద్ర నిర్మాణం, వెల్ నెస్ సెంటర్ నిర్మాణాలు జరిగటమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న జగనన్నను మరోసారి నిండు మనస్సుతో ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పెడనలో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అమలయ్యే సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందేలా కృషి చేస్తానన్నారు. మీలో ఒకడిగా, అన్నగా, తమ్ముడిగా కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్లం పెదబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, సర్పంచి బండి అంజలిదేవి, ఆర్బీకే చైర్మన్ కొల్లు శివ, పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, పుప్పాల సురేష్, ఊకంటి వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాంచారమ్మ జాతర

- చివరి రోజు కొనసాగిన భక్తుల రద్దీ
- ఆలయ ప్రవేశం చేసిన చిన్నఅమ్మవారు



అమ్మవారి ఊరేగింపు వద్ద భక్తుల రద్దీ

కోడూరు:విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ప్రధాన జాతర మంగళవారంతో ముగిసింది. జాతరలో తొలిరోజు కొండవీటివంశీయుల, అమ్మవారి పుట్టింటివారైన గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులు పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. సోమవారం గుడి ప్రధాన జాతర జరగ్గా, రాత్రి సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం జాతరలో భక్తుల రద్దీ కొనసాగింది. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు నైవేద్యాలు సమర్పించేందుకు తరలివచ్చారు. ఈ నెల 11న నాంచారమ్మ చిన్నఅమ్మవారి గ్రామోత్సవం ప్రారంభం కాగా, జాతర కూడా పూర్తికావడంతో చిన్నఅమ్మవారిని అధికారులు ఆలయ ప్రవేశం చేయించారు. యువకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ సీహెచ్.సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెదప్రోలు(మోపిదేవి):పెదప్రోలు గ్రామంలో అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత 15 రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో బాగంగా ఇంటింటా దర్శనం ఇచ్చిన అమ్మవారిని తెల్లవారుజామున ఆలయ ప్రవేశం చేశారు. మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో అమ్మవారి ఆలయ ప్రవేశం నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాతంగా నిర్వహించడానికి సహకరించిన అధికారులు,పోలీస్ సిబ్బంది,గ్రామస్తులకు ఆల యకమిటీ అధ్యక్షులు ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.8.21 లక్షలు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర సందర్భంగా హుండీ ద్వారా ఆలయానికి రూ.8.21 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ సీహెచ్.సుధాకర్ తెలిపారు. ఈ నెల 24,25 తేదీల్లో అమ్మవారి జాతరోత్సవాలు జరగ్గా హుండీలను మంగళవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.8,21,759 ఆదాయం లభించినట్లు ఈఓ చెప్పారు. గత ఏడాది కంటే రూ.1,35,310 ఆదాయం అధికంగా లభించిట్లు ఈఓ చెప్పారు. టికెట్లు, విరాళాలు, వివిధ రకాల పాటలకు సంబంధించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు.

నారీశక్తి అవార్డు ప్రదానం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాజామాణిక్యంకు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నారీశక్తి-24 అవార్డు ప్రదానం చేసింది. ఈ నెల 24వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజామాణిక్యంకు ఈ అవార్డును అందజేశారు. మచిలీపట్నం హిందూ కళాశాలలో అధ్యాపకురాలిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆమె ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాజామాణిక్యంకు నారీశక్తి అవార్డు రావటం పట్ల రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద బాబు, పలువురు అధ్యాపకులు, విద్యావేత్తలు, నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

భార్యాభర్తలకు గాయాలు

పెడన: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మచిలీపట్నం రాజుపేటకు చెందిన తలారి కాశేశ్వరరావు భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై సోమవారం మధ్యాహ్నం బంటుమిల్లిలో ఫంక్షన్ చూసుకుని మచిలీపట్నం వస్తున్నారు. పెడన మండలం బల్లిపర్రు గ్రామం వద్ద కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కాశేశ్వరరావు, అతని భార్యకు తీవ్ర గాయా లయ్యాయి. 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ మంగళవారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పెడన: పట్టణంలోని 11వ వార్డులో అమృత దుర్గ బడ్డీకొట్టు నిర్వహిస్తోంది. పోలీసులు బడ్డీకొట్టులో తనిఖీలు నిర్వహించగా ఐదు మద్యం (క్వార్టర్) సీసాలు లభ్యమవగా స్వాధీనం చేసుకుని అమృతదుర్గను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ తెలిపారు.

పేద విద్యార్థికి సాయం

చల్లపల్లి: పేద విద్యార్థులకు రాంకీ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని ఎస్సార్ వైఎస్సీ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు అన్నారు. మంగళవారం పేద విద్యార్థి కళ్లేపల్లి హేమంత్ బీటెక్ విద్యాభ్యాసం కోసం రాంకీ ఫౌండేషన్ చైర్మన్ ఎంవీ రామిరెడ్డి సహకారంతో ఫౌండేషన్ సీఎస్ఆర్ మేనేజర్ సీహెచ్ మహేంద్రబాబు రూ.12 వేలు ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఈ సహాయాన్ని సాంబశివరావు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు అశ్విన్ కుమార్, హేమంత్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేటి నుంచి కౌలు హక్కులకు వేలం

శ్రీకాకుళం(ఘంటసాల): చల్లపల్లి ఎస్టేట్ దేవాలయం శ్రీకాకుళేశ్వరస్వామివారి దేవస్థానం భూముల కౌలు హక్కుల బహిరంగ వేలం బుధవారం నుంచి 29 వరకు జరుగుతుందని ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు మంగళవారం తెలిపారు. శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానానికి శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, ఐనంపూడి గ్రామాల్లో ఉన్న భూములతో పాటు తెలుగురావుపాలెంలో ఉన్న చేపల చెరువులకు దేవదాయ ధర్మదాయశాఖ వేలం నిర్వహిస్తుందన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటరమణ



పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వెంకటరమణ

పెడన: ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా అన్ని పార్టీల వారు పాటించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలోని ఈఆర్వో ఛాంబరులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారం ఎక్కడ, ఎప్పుడు, ఏ రోజు, ఏ సమయం నుంచి ఏ సమయం వరకు నిర్వహిస్తున్నారనే వివరాలను సుబేదా యాప్ ద్వారా 48 గంటల ముందుగా తెలియజేసి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రచారంలో పాల్గొనే వాహనాలకు కూడా అనుమతులు లేకపోతే సీజ్ చేయాల్సి వస్తుందని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు. నియమావళిని అతిక్రమించకుండా అభ్యర్థులకు పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు. వాహనాలు, ప్రచారాలు, ప్రచారానికి వినియోగించే మైకులు తదితర వాటి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అనుమతులు పొందాలన్నారు. వైఎస్సార్ సీపీ పెడన పట్టణ, మండల కన్వీనర్లు బండారు మల్లికార్జునరావు, కొండవీటి నాగబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్యామలయ్య, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి

- ప్రజల సమస్యలు తెలుసుకున్న పేర్ని కిట్టు
- 20వ డివిజన్‌లో గడప గడపకు సంక్షేమం



వృద్ధురాలితో మాట్లాడుతున్న పేర్ని కిట్టు చిత్రంలో కార్పొరేటర్ వరప్రసాద్

మచిలీపట్నంటౌన్: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పేర్కొన్నారు. గడప గడపకు సంక్షేమం కార్యక్రమం మంగళవారం 20వ డివిజన్ పరిధిలోని గిలకలదిండిలో పేర్ని కిట్టు నిర్వహించారు. పేర్ని కిట్టుకు ప్రజలు గజమాల వేసి మంగళహారతులు ఇచ్చి పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఆ డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్ తో కలిసి పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్ర లో ప్రజల సమస్యలను, కష్టాలను స్వయంగా పరిశీలించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన పాలనలో ఆయా వర్గాల సమస్యలు, కష్టాలను తీర్చే విధంగా అడుగులు వేశారన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రతి కుటుంబానికి పలు సంక్షేమ పథకాలు అందగటంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయన్నారు. ఈ పర్యటనలో పేర్ని కిట్టు వెంట పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గిలకలదిండి ప్రాంత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



పక్షవాతంతో బాధపడుతున్న శామ్యుల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం పరామర్శించారు. కొక్కిలిగడ్డ ఎస్సీ ఏరియాలో పక్షవాతంలో బాధపడుతున్న కంచర్ల శామ్యుల్, ఇదే గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిన వలంటీర్ అంద్రరాజు లక్ష్మీనారాయణను పరామర్శించి, వారికి దౌర్యం చెప్పారు. పెదకళ్లేపల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బడే శ్రీరామకృష్ణ (35) చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మారుబోయిన బాపనయ్య (62) గుండెపోటుతో ఇటీవల మృతి చెందగా ఆయన భార్య వెంకటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, మండల ఎస్సీసెల్ కన్వీనర్ బోడాబత్తుల పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు తుటారం కృష్ణ, గ్రామ పార్టీ కన్వీనర్లు రాయన సత్యనారాయణ, ముమ్మనేని అరవింద్, మత్తి రాజాచంద్, గండు దుర్గారావు, అరజా వెంకట చలపతిరావు, కేసాని వెంకటేశ్వరావు, తోట కృష్ణాంజనేయులు, అరజా వెంకట సుబ్బారావు, కొండేటి రమేష్, గండు సాంబశివరావు, గండు సత్యనారాయణ, కలారి రామారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నిరుపేదల ఆర్థిక ప్రగతికి జగన్ కృషి

పాగోలు(చల్లపల్లి): సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేశారని అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు సింహాద్రి వికాస్ బాబు అన్నారు. మంగళవారం రాత్రి చల్లపల్లి మండలం పాగోలులో వికాస్ పర్యటించారు. గ్రామంలో వృద్ధులు, మహిళలు, యువకులు ప్రతి ఒక్కరినీ పలుకరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యన్నారాయణ, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పైడి పాముల వెంకటే శ్వరరావు, సాయి, అయ్యంకి చారి, అంజియ్య, చలం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పెడన: పట్టణంలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ బి.వెంకటరామయ్య పర్యవేక్షించారు. పారిశుద్ధ్యం పనుల నిర్వహణలో అలసత్వంపై ఇటీవల కౌన్సిల్ సమావేశంలో కొందరు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం ఉదయం కమిషనర్ పట్టణంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్య సిబ్బందికి, శానిటరీ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. ఆయా వార్డు సచివాలయాల్లో ఉండే శానిటరీ కార్యదర్శులు సైతం కమిషనర్‌తో పాటు ఉండక తప్పని పరిస్థితి ఏర్పడింది. అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడితే మాత్రం వెంటనే సదరు సిబ్బందికి, శానిటరీ కార్యదర్శులకు మెమోలు జారీ చేస్తూ హెచ్చరికలు పంపిస్తున్నారు.

రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు మృతి



మోపిదేవి: అర్చక కుటుంబంలో వారం వ్యవధిలో మరో విషాదం చోటు చేసుకుంది. మోపిదేవిలో రిటైర్డ్ టీచర్ బుద్ధు సుబ్బయ్య శర్మ (75) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవలనే ఆయన మనవడు కార్తీక్ (14) గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈయన కర్మకాండలు పూర్తికాకముందే ఇది మరో విషాదం. సుబ్బయ్య శర్మకు సోమవారం శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అయితే శర్మ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తెలుగు ఉపాధ్యాయుడిగా సుబ్బయ్య శర్మ ఉద్యోగవిరమణ చేసిన అనంతరం స్థానిక ఆలయంలో అర్చక సేవలు అందిస్తున్నారు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్డు ఉన్నారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు లింగం జగదీష్‌కుమార్, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావుమృతదేహాన్ని సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగోత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి శ్రీ పుష్పయాగోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ద్వాదశ ప్రదక్షిణల అనంతరం స్వామివారి పవళింపుసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరంగంటి శేషాచార్యులు, సీతమ్మ, లీలానంద కృష్ణమాచార్యుల దంపతులు పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల రామసత్యగోపాల్ అవధాని వేదపారాయణ భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వేణుగోపాలరావు, ఆలయ కమిటీ సభ్యుడు నూకల ప్రసాద్ పర్యవేక్షించారు.

వీసీని కలిసిన కేయూ పూర్వ విద్యార్థులు



వీసీ జ్ఞానమణిని కలిసిన పూర్వ విద్యార్థులు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘ నేతలు మంగళవారం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణిని కలిశారు. పూర్వ విద్యార్థుల సంఘం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను చర్చించారు. త్వరలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించేందుకు నిర్ణయించామని, సహకరించాలని ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణిని కోరారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కలిసి పనిచేయాలని జ్ఞానమణి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి, ఇంజినీర్ బసవేశ్వర బాబు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఎండీ నూరుద్దీన్ యాసఫీ, చాట్ల సురేష్, పోతన ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి..



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

అవనిగడ్డ: కోడూరుకు చెందిన టీడీపీ, జనసేన నుంచి పది కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో జనసేన నేత నరహరిశెట్టి శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకుడు అరజా ఏడుకొండలుతో పాటు మరో ఐదు కుటుంబాలకు చెందిన వారికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతో ఆకర్షితులై పార్టీలో చేరినట్టు చెప్పారు. పోతన ప్రభు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, కోడూరు జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, పరిశె మాధవరావు, బడే హేమగంగాధర్, ముద్దినేని చంద్రరావు పాల్గొన్నారు.

ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి అభినందన

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నలుకుర్తి రమేష్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అభినందించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రమేష్‌కి ఎమ్మెల్యే సింహాద్రి శాలువా కప్పి అభినందించారు. రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు



అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రిటర్నింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ నియోజకవర్గంలో 267 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. నియోజకవర్గంలో 53 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. 140 పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 4,479 మంది వికలాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 1,471 మందిని గుర్తించామని వారంతా ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో 1,250 మందిని బైండోవర్ చేశామని చెప్పారు. చెకింగ్ ద్వారా ఇప్పటికే రూ.35 లక్షల నగదు, 165 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో 9 మంది గన్‌లైసెన్స్ దారుల నుంచి గన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఘంటసాల: పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారిణి, ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ అధికారులకు సూచించారు. ఘంటసాలలో వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఈఓపీ ఆర్డీ గుత్తికొండ కిషోర్‌తో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ చెరుకూరి శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.